క్లుప్తంగా

పైప్‌లైన్ నిర్మాణానికి భూమిపూజ



ఇబ్రహీంపట్నం: స్థానిక 22వ వార్డులో జాకీర్ హుస్సేన్ కళాశాల రోడ్డులో పైపులైన్ నిర్మాణానికి మునిసిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం భూమిపూజ చేశారు. ఆ ప్రాంత ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్.శివశంకర రావు, నాయకులు లంకే అంకమోహనరావు, గుంజా శ్రీనివాసరావు, పచ్చిగోళ్ల పండు, చిన్నయ్య, ప్రకాష్, దయాకర్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ అనూరాధకు సన్మానం



జి.కొండూరు: స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న జి.కొండూరు ఎంపీడీఓ అనూరాధను ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ గురువారం ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. మండల అభివృద్ధి కోసం ఎంపీడీఓగా తన సేవలను మరింత కాలం కొనసాగించాలని ఎంపీపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని కోరుతూ ర్యాలీ



జి.కొండూరు: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, హింసాత్మక ఘటనలను అణిచివేసి శాంతి నెలకొల్పాలని కోరుతూ డీవైఎఫ్ఐ జి.కొండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ.. మణిపూర్‌లో ఉన్న సహజ వనరులను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ మత ఘర్షణలను రెచ్చగొట్టి అల్లర్లను సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. ఈ కుట్రను భగ్నం చేయాలంటే దేశ ప్రజలంతా ఏకమవ్వాలని కోరారు. కార్యక్రమంలో దళిత,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు ప్రారంభం



తిరువూరు: శ్రావణ మాసం సందర్భంగా తిరువూరులోని పలు ఆలయాల్లో గురువారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీఅష్టలక్ష్మి ఆలయం, శ్రీగౌరీ కేదారేశ్వరాలయం, శ్రీకనకదుర్గాలయం, పీటీకొత్తూరు రామాలయం, కోదండ రామాలయం, షిర్డీ సాయి మందిరం, శ్రీరామలింగేశ్వరాలయంలో శ్రీలక్ష్మీదేవికి అష్టోత్తర శతనామాలతో కుంకుమపూజలు జరిపారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం

మైలవరం: ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవాన్ని మైలవరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ వెంకట్రావు ఆధ్వర్యంలో జర్నలిస్టులు మైలవరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు, పళ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఏపీపీ ఎం.రమేష్, ఆత్మీయ అతిథిగా మోహన్‌రెడ్డి, విశిష్ట అతిథిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామారావు పాల్గొన్నారు. ఆస్పత్రి ఆవరణలో కేక్ కట్ చేసి యూనియన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

కూరగాయల విత్తనాల పంపిణీ



చాట్రాయి: రైతులు కూరగాయ సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని మండలంలోని పోలవరం పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో దళిత రైతులకు గురువారం ఉచితంగా కూగాయల విత్తనాలు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని అధిక ఆదాయాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు సీఎం జగన్‌కే సాధ్యం

నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



ఆగిరిపల్లిలో మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్ర ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేసే సత్తా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పట్టణ, మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండలంలో 1,688 గ్రూపులకు రూ.2.14 కోట్లు, పట్టణంలో 729 సంఘాలకు రూ.97.51 లక్షలు వైఎస్సార్ సున్నావడ్డీ పథకంలో ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు విడుదల చేసింది. దీనిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే ఇచ్చిన హామీలు అన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ప్రకటించి దాని ప్రకారం పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలుకుతున్నారని, వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమన్నారు. చంద్రబాబు అధికారం కోసం ఇచ్చే హామీలన్నీ శుద్ధ అబద్ధాలని ధ్వజమెత్తారు. 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు 650 హామీలు ఇచ్చి ఆరు కూడా అమలు చేయలేదని గుర్తుచేశారు. చంద్రబాబు చెప్పే మాయమాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సున్నావడ్డీ చెక్కు అందజేశారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష, మున్సిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు అక్కినేని శ్రీవాణి, దండుబోయిన స్వర్ణలత, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు శీలం రాము, పోలిమెట్ల శివ, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, పిళ్లా చరణ్, ఏసీ విజయకుమారి, డీపీఎం రామోజీ, టౌన్ సీఐ ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఏపీఎం దయాల రాజశేఖర్, సీఎంఎం ఆనంద్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



నూజివీడులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

ఆగిరిపల్లి(నూజివీడు): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదల ఇంటికే నేరుగా అందజేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లిలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ సున్నా వడ్డీ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మండలంలోని 1,230 గ్రూపులకు సున్నా వడ్డీ కింద ప్రభుత్వం రూ.1.68 కోట్లను డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేసిందన్నారు. నాలుగు విడతల్లో రూ.4.67 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2016లోనే సున్నా వడ్డీని నిలిపివేశాడని, 2020లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ పథకాన్ని మరల పునరుద్ధరించారన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, తహసీల్దార్ ఎం.ఉదయభాస్కర్, ఎంపీడీఓ పి.శంకర్‌రావు, ఏపీఎం రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, ఎంపీటీసీ సాదం గోపీ, నాగుల్‌మీరా, నాయకులు మచ్చా హరిబాబు, అత్తి మురళీ, చిమటా శ్రీనివాసరావు, తులిమెల్లి పావనిజ్యోతీకుమారి, వాకా సక్కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బసవా భాస్కరరావు విగ్రహం ఆవిష్కరణ



బసవా భాస్కరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ తదితరులు

నూజివీడు: మునిసిపల్ మాజీ చైర్మన్ బసవా భాస్కరరావు లేని లోటు తీర్చలేనిదని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని కృష్ణా బడ్డీ కొట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన బసవా భాస్కరరావు కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ.. భాస్కరరావు స్నేహశీలి అని, తామిద్దరం కలిసి పట్టణ అభివృద్ధికి కృషి చేశామన్నారు. మునిసిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు మాజీ చైర్‌పర్సన్ మద్దిరాల కోటమ్మ, కోఆప్షన్ సభ్యుడు లాం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, కౌన్సిలర్ తవిడశెట్టి అశోక్, మాజీ కౌన్సిలర్ తవిడశెట్టి అశోక్, భాస్కరరావు కుమారులు బసవా రామకృష్ణ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన ఎస్ఐ



నూజివీడు: మండలంలోని అన్నవరం పంచాయతీలో ఐదో వార్డు సభ్యుడి పదవికి ఈ నెల 19న ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్‌ను రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ గురువారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ ఆవరణ, భవనాన్ని పరిశీలించి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యూవల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు 2023–2024 విద్యా సంవత్సరానికి రెన్యూవల్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో 2022–2023 విద్యా సంవత్సరంలో మార్చి 31 తేదీ నాటికి కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పని చేసిన వారు మాత్రమే కాంట్రాక్ట్ పునరుద్ధరణకు అర్హులన్నారు. అర్హత కలిగిన అధ్యాపకులు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ ఐడీ కళాశాల (ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల) ప్రిన్సిపాల్‌కు సమర్పించాలన్నారు.

పాడిరైతులకు రూ.1.80 కోట్ల బోనస్ పంపిణీ



తిరువూరు మండలం లక్ష్మీపురంలో రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న చలసాని

లక్ష్మీపురం(తిరువూరురూరల్): పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ పలు పథకాలు అమలు చేస్తోందని యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. లక్ష్మీపురం పాల శీతల కేంద్ర ఆవరణలో రైతులకు రూ.1.80 కోట్ల బోనస్ పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరల వ్యత్యాసం కింద ఈ ఏడాదిలో రైతులకు యూనియన్ రూ.14 కోట్లకు పైగా సొమ్మును పంపిణీ చేస్తోందన్నారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా క్షీరబంధు, కల్యాణమస్తు, ప్రతిభ అమలు చేస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు బొట్టు రామచంద్రరావు, బోయపాటి సునీల, నెక్కళపు వాణిశ్రీ, ట్రస్టు సభ్యులు పల్నాటి సత్యనారాయణ, విజయలక్ష్మి, పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



డ్వాక్రా మహిళలకు గొర్రెలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

విస్సన్నపేట: స్వయం సహాయక గ్రూపు మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు జీవనోపాధి కల్పనలో భాగంగా 23 మందికి గురువారం గొర్రెలు, మేకలు యూనిట్లను ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె.సీత, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శోభారాణి, ఏపీఎం జమలయ్య పాల్గొన్నారు.

ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన



రాధాకృష్ణుల విగ్రహాలను పరిశీలిస్తున్న చైర్మన్ రాంబాబు, ఈఓ భ్రమరాంబ తదితరులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణానికి చేరుకున్న చైర్మన్, ఈఓ, వైదిక కమిటీ సభ్యులు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకోవడంతో పాటు మరింత వేగవంతంగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అతి పురాతనమైన రాధాకృష్ణుల విగ్రహాలను పరిశీలించారు. రాధాకృష్ణుల విగ్రహాలతో పాటు చుట్టూ ఉన్న గోపికల విగ్రహాలను అందంగా తీర్చిదిద్దేలా రంగులు వేయాలని సూచించారు. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, మురళీ, కోట ప్రసాద్ పాల్గొన్నారు.

దోమలతో వ్యాధుల వ్యాప్తి



నూజివీడులో దోమల లార్వా సాంద్రత సర్వేను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నూజివీడు: దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎం.యలమంద సూచించారు. పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీ, రామాయమ్మరావుపేట, అమ్మవారితోట ప్రాంతాల్లో గురువారం వైద్య ఆరోగ్య సిబ్బంది దోమల లార్వా సాంద్రతపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఆవాస ప్రాంతాల్లో దోమల లార్వా సంఖ్యను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలు వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకునేందుకు ఈ సర్వేను నిర్వహిస్తున్నామన్నారు. దోమల వల్ల ప్రాణాంతక రోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు. మురుగునీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే ను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సామాజిక దురాచారాలను పారదోలాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ సమరం

పటమట(విజయవాడతూర్పు): సామాజిక అసమానతలను, సాంఘిక దురాచారాలను పాటించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రముఖ వైద్యుడు జి.సమరం అన్నారు. నాస్తిక కేంద్రంలో సాంఘిక దురాచారాల నిర్మూలన అంశంపై గురువారం సదస్సు జరిగింది. డాక్టర్ సమరం మాట్లాడుతూ.. సమాజంలో పేరుకుపోయిన అవినీతి, అనాగరికత, దోపిడీ వ్యవస్థలను రూపుమాపాలని, స్త్రీలపై జుగుప్సాకరంగా జరుగుతున్న ప్రవర్తనలు అంతం కావాలన్నారు. ఉన్నత విద్యావంతుల కుటుంబాల్లోనూ స్త్రీలపై చులకన భావం పెరుగుతుందని, ఇది సమాజ శ్రేయస్సు కాదని చెప్పారు. ఈ సందర్భంగా ఈ నెల 9న క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్థిక సమత మండలి ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, బి.మణి, గోరా సైన్స్ డైరెక్టర్ జి.నియంత, దిలీప్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలి



చౌటపల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

చౌటపల్లి(తిరువూరురూరల్): వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్య సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి కోరారు. మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన గురువారం జరిగింది. సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని, పీహెచ్‌సీలో కూడా ఔట్‌పేషెంట్లకు చికిత్స అందించాలని సూచించారు. ఆస్పత్రి వైద్యులు పూజిత, కల్యాణ్‌చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సున్నా వడ్డీ చెక్కుల పంపిణీ

చాట్రాయి: డ్వాక్రా గ్రూపు మహిళలకు సున్నా వడ్డీ రుణాల చెక్కులను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు వెలుగు ఏపీఎం శేఖర్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ త్వరలో ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే రక్షణనిధి



తిరువూరులో యూపీహెచ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తిరువూరు: రూ.కోటి వ్యయంతో తిరువూరులో నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. స్థానిక విజయవాడ రోడ్డులో నిర్మాణంలో ఉన్న యూపీహెచ్‌సీ భవనాన్ని ఆయన గురువారం సందర్శించారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా ఈ ఆస్పత్రిని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఆధునిక వైద్యపరికరాలు, నిపుణులైన వైద్యులతో ఈ ఆస్పత్రి సిద్ధమవుతోందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, ఏరువ ప్రకాష్‌రెడ్డి, పరసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించాలి

డీఎస్ఓ హుసేన్



ఇన్‌స్పైర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హుసేన్

మైలవరం: విద్యార్థుల్లో సృజనాత్మక వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి (డీఎస్ఓ) ఎం.హుసేన్ సూచించారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈఓ సి.వి.రేణుక ఆదేశాల మేరకు గురువారం డివిజన్ స్థాయి ఇన్‌స్పైర్ అవగాహన కార్యక్రమం జరిగింది. గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, ఎ.కొండూరు, మైలవరం మండలాలకు చెందిన ప్రభుత్వ, జెడ్పీ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు. మైలవరం డివిజన్ పరిధిలో అన్ని పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ ద్వారా విద్యా బోధన చేయాలని, ప్రజలకు ఉపయోగపడే నూతన పరికరాలను తయారు చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఎస్ఓ హుసేన్ సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి ఉపయోగపడే విధంగా ఈ కొత్త ఆలోచనలు సృజనాత్మకంగా ఉండాలన్నారు. ఇన్‌స్పైర్ 2023–24 నామినేషన్స్ నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లు రామకృష్ణ, డి.శ్రీనివాసరావు, నామినేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ చేసే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు.

దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి

మైలవరం: దేశ ప్రగతికి విద్యార్థులు ఎంతో అవసరమని స్పిక్ గ్రీన్ స్టార్ కంపెనీ విజయవాడ రీజియన్ జనరల్ మేనేజర్ వడ్డే శ్రీకాంత్ పేర్కొన్నారు. మైలవరం ఆరో వార్డులోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన ఆజాద్ హిందూ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కంపెనీ ప్రతినిధులు ఎస్కే నదీమ్ అర్షద్, జయచంద్రారెడ్డితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వడ్డే శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మొక్కలకు సేంద్రియ పద్ధతుల్లో స్పిక్ గ్రీన్ స్టార్ ఎరువులు ఉపయోగపడతాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్, మస్తాన్‌రావు, పీఎంసీ చైర్మన్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దసపర్ని ద్రావణంతో ఎన్నో ఉపయోగాలు



దసపర్ని ద్రావణం తయారీని వివరిస్తున్న రైతు సాధికార సంస్థ ప్రతినిధులు

చంద్రగూడెం(మైలవరం): దసపర్ని ద్రావణంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ శాఖ మైలవరం మండలం ఇన్‌చార్జి జన్ని శాంతికుమారి తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెం గ్రామంలో రైతులకు అన్ని రకాల పంటలను ఆశించే పురుగులు, తెగుళ్ల పూర్తి నియంత్రణ కోసం దసపర్ని కషాయం తయారు చేసే విధానాన్ని గురువారం వివరించారు. వ్యవసాయ శాఖలో ప్రకృతి వ్యవసాయం ఒక భాగమని, సేంద్రియ ఎరువులు, ద్రావణాలు వినియోగించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందొచ్చని రైతులకు సూచించారు. ద్రావణం తయారీకి వేపాకు, జిల్లేడు, ఉమ్మెత్త, కానుగ, సీతాఫలం, వావిలాల, కాకర, మందార ఆకులు రెండు కిలోల చొప్పున, రెండు కిలోల ఆముదం, తులసి ఆకులు, పొగాకు ఆకులు, పచ్చిమిర్చి కిలో చొప్పున, 1/5 కిలోల వెల్లుల్లి, అర కిలో పసుపు, 100 గ్రాములు ఇంగువ, 20 లీటర్లు ఆవు మూత్రం, రెండు కిలోలు ఆవు పేడ అవసరమన్నారు. అన్ని రకాల ఆకులను రుబ్బి, 200 లీటర్ల నీటి తీసుకుని, డ్రమ్ములో కలిపి రోజు ఉదయం, సాయంత్రం కలియదిప్పితే 40 రోజులకు ద్రావణం సిద్ధమవుతుందని వివరించారు. ఎకరానికి ఆరు లీటర్లు ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలను నివారించొచ్చని సూచించారు. రైతు సాధికార సంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనుల తనిఖీ



తిరువూరు మండలం ముష్టికుంట్లలో తాగునీటి నాణ్యత పరిశీలిస్తున్న అధికారులు

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులను కేంద్ర బృందం గురువారం తనిఖీ చేసింది. దేవేంద్రసింగ్ బజ్వా, రాజేష్‌కుమార్ బన్సాల్ తదితర అధికారులు మండలంలోని లక్ష్మీపురం, గానుగపాడు, చింతలపాడు, ముష్టికుంట్ల, వామకుంట్ల, అక్కపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో కుళాయి పన్నుల వసూలు, కనెక్షన్ల మంజూరు, పంచాయతీ తీర్మానాలు, మురుగునీటి పారుదల సదుపాయం, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణ, వినియోగ చార్జీల వసూలు, సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో తిరువూరు ఇన్‌చార్జి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్వామినాయక్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com